# కొత్త ప్రమిదెలో చిన్న దీపం

తననుండి—కొడుకుకు ప్రత్యేక వ్యక్తిత్వం ఉన్నదని ఆమె ఎప్పుడూ ఊహించ లేదు. ఇంటిపట్టు వదలకుండా ఎప్పుడూ చిరుతిళ్ళకోసం ప్రదక్షిణలు చేస్తూ పుస్తకాల లోకం నుండే తృప్తిని పొందుతూ యువకుడైన కొడుకు హృదయపు లోతుల్లోకి ఆ తల్లి తొంగిచూడలేదు— అంతకు ముందెన్నడూ. కాని ఆ రోజున కొడుకును ఎగాదిగా చూసింది. ఆ చూపుకు ఇది వరలో అయితే, ఆతని అంతరాంతరాలన్నీ అందేవి, ఇప్పుడు—కొడుకు బాహ్యరూపం మాత్రం కన్పించిందామెకు.

"ఇక్కడకాదమ్మా! నేను కాశీలో చదువు కుందామని నిశ్చయించు కొన్నాను" అమ్మ నూనెతో తలంటుతుంటే కళ్ళు మూసుకొని, తన నిశ్చ యంలో విశేషం ఏమీ లేనట్లే, అది అతి సామాన్య విషయమైనట్లే అన్నాడు.

చేతిలో నూనె వేసుకుంటున్నది, ఆ చెయ్యివణికి నూనెసీసా అరుగు మీద పెట్టింది. రెండవ చేతివేళ్ళ సందు నుంచి నూనె జారి అతని వీపు మీద వాలికింది.

"ఏమమ్మా" అని జనార్దనం కళ్ళు నులుముకొని తల్లివంక చూడ బోయాడు.

"ఏం లేదు నాన్నా" కొడుకు తలంటటం తిరిగి ప్రారంభించింది,

ఇప్పుడామె చేతులు వణకటం లేదు, ఆమె గుండె వణికిపోతున్నది. ఇన్నేళ్ళ తపమా? ఇదా వరం?

వేన్నీళ్ళు తోడుతూ అమె తిరిగి కొడుకును-చూచుకుంది. ఎన్నేళ్ళ తర్వాతనో మొదటిసారి చూచినట్లుగా. అవే నూనూగు మీసాలు. అదే పలచని జుట్టు. అవే పుట్టుమచ్చలు దాగిన బుగ్గలు. కాని అంతరంలోని అతని హృదయ రూపం కన్పించలేదు.

"జనూ... నాతో మాట మాత్రం అనలేదేం నాన్నా"

"అది కాదమ్మా...ఇది యూనివర్సిటీలు, చదువుల సంగతి నీకేం తెలుస్తుందమ్మా"

ఎన్నడూ, ఏ సందర్భంలోనూ తనను అడగనిదే, తన అనుమతి పొంద నిదే, తనకు తృప్తీ, సంతోషంకానిదే-ఏ పనీ చేసి ఉండని కొడుకు, తను లేక పోతే ఏమైపొయ్యేవాడు-అనుకొనేది. కాని, కాశీకిపోయి చదువుదామని-తనతో సంప్రదించని కఠిన నిశ్చయానికి ఎట్లా వచ్చాడు? ఏ పుస్తకాల ప్రపంచంతో ఇంట్లో ముచ్చట కల్పించాడో ఇన్నాళ్ళూ, ఆ ప్రపంచమే తల్లికి దుఃఖదాయక మవుతుందని కలగన లేదు. అమ్మా నీకు తెలియందేమిటమ్మా-అన్న కొడుకే-నీకేం తెలుస్తుందమ్మా అంటున్నాడు. తెలియదా? మట్టిముద్దనుంచి నిండు మనిషిని చేసిన తల్లి-తనకు-తన రక్త స్వరూపం- తన బిడ్డనుండి తెలియని విషయాలున్నాయా? అనుకొన్నదిన్నాళ్ళూ.

మొదట భర్త, తర్వాత కూతురు. ఇప్పుడు తన జీవితరాగం అనుకున్న కొడుకు. ఇదేనా స్త్రీ జీవితం? ఇతి హాసం? తనకు ముక్తిమార్గం లేదా? భక్తి జ్ఞాన యోగమార్గాల్లో పురుషులు ముక్తిసాధన చేయగలరు. కాని స్త్రీ-బాల్యంలో తల్లిదండ్రుల సేవలో తరువాత భర్త సేవలో, వృద్ధాప్యంలో బిడ్డలమీది ఎడ తెగని మమకారంతో ముక్తి పొందాలా? తన కది నిరాకరించటానికి వాళ్ళందరికి అధికారం ఉందే! జనూ! జనూ! నా బిడ్డా!!

జనార్ధనం కాశీ ప్రయాణానికి అన్నీ సర్దుకోవటంలో నిమగ్నుడై ఉన్నాడు. దూరం, పరరాష్ట్రం, కొత్త జీవిత పరిసరాలు. నూతన వ్యక్తులూ, స్నేహితులూ యివ్వనున్న-కొత్త అనుభవాలకోసం అతను ఎదురు చూస్తు న్నాడు. ఆ ఉద్విగ్నతలో తల్లి మానసికాందోళనను అతడు గమనించలేదు. తన తల్లేగదా అనుకున్నాడా? ఆ కలలతోనే కాశీ వెళ్ళిపోయాడు.

తల్లి కన్నీళ్ళు ఇంకిపోయి, అతను బీరువాలో సర్దిపోయిన పుస్తకాలను, రోజుకు పరిసార్లు తిరిగి తిరిగి సర్దసాగింది. రైలు బండి దగ్గర "నాన్నా ఉత్తరాలు వ్రాస్తూంటావా?" అని అడిగింది. "ఎందుకు వ్రాయనమ్మా నేనక్కడ ఉండగానే, నువ్వు కాశీవచ్చి, విశ్వనాథుడి దర్శనం చేసుకొని ఉత్తరదేశ యాత్రలు చేసివద్దువుగానమ్మా!" అని అన్నాడు. అతను మాట అన్నాడు. అమ్మకది కొత్త ఆశ. తెగిదూరమై, మరుపులోకి, కాలపు లోతులలోకి పోయి, మాయమవుతయె అనుకొంటున్న మాతృ బంధనాలు—తిరిగి ఆ ఒక్క వాక్యంతో స్నేహలతవలె, అడవిమానుకు చుట్టుకున్న పేరులేని తీగెలవలె పెనవేసుకొన్నవి. "జనూ—నా జనూ!" తండ్రివలె పెళ్ళి కాగానే భర్తతో అత్తగారింటికి వెళ్ళి మరచిన కూతురువలె గాకుండా—జనూ తన నీడ, తన నరం, తన మనస్సు అనుకొన్నది. ఇంకిపోయిన కన్నీళ్ళు తిరిగి సెలయేరై వెచ్చగా ఆనందంగా, గర్వంగా ప్రవహించ సాగినవి, జనూ, నా జనూ- అని ఆమె రామనామోచ్చారణ చేసింది.

* * *

జనూ ఉత్తరాలు వ్రాశాడుగాని, తల్లిని ఆహ్వానించటం మరిచిపోయాడు కొన్నాళ్లు. మరొకసారి "అమ్మా ఇంటిమీద దిగులుతో హాస్టల్లో తిండి సహించటంలేదు. చదువు సాగటం లేదు" అని వ్రాశాడు. ఆమె కాశీ ప్రయాణానికి సిద్ధమైనది. తనకొడుకు చేతుల మీదుగా పావనగంగలో ఐక్యం కాగల అదృష్ట రేఖ తన కున్నదని ఏమేమో అనుకొన్నది. కొడుకు కదిలి రమ్మనలేదు. కాని చిగిర్చిన ఆ ఆశాలతనే నెలలకు నెలలు పెంచుకొన్నది.

చివరకు ఒంటరితనం భరించలేక, తనను కాదని పోయిన కూతురును పిలిపించుకొన్నది.

"రుక్కూ! అన్నయ్య చదువు పూర్తయిందాకా నువ్విక్కడే ఉండు తల్లీ" అన్నది.

రుక్మిణి వచ్చిన మూడవరోజునే ప్రయాణమైపోతూ, "నేను లేకపోతే ఆయన ఒక్క క్షణం ఉండలేరమ్మా. ఆయన కిక్కడవచ్చి ఉంటం సుతరామూ గిట్టదు" అన్నది.

"రుక్కూ! నువ్వు నా కెప్పుడో దూరమైపోయావుగా. ఏదో భ్రమలో అడిగాలే తల్లీ!"

రుక్మిణి ఆమాటలు వినిపించుకొన్నదో లేదోగాని ఏమీ సమాధానం మాత్రం చెప్పలేదు. తనకు కావలసిన చీరెలు, మొగుడిని తృప్తిపరచేందుకు

డబ్బా రుక్కుకు దొరికినవి. అంతకు మించి, ఆ ఆడబిడ్డ అమ్మ విలువ నెప్పుడూ ఎరగదు.

సంవత్సరం గడిచాక జనూ వేసవి సెలవలకి వచ్చాడు. వచ్చిన రోజునే అన్నం పెడుతూ అమ్మ అడిగింది.

"నాన్నా సెలవలు అయిపోగానే వెళ్లాలా?"

వారణాశి విశేషాలు, గంగానదీ తీరంమీద— పురాణయుగం నుంచీ అనుస్యూతంగా వస్తూన్న ఘట్టాలు, విశ్వనాథుడి ఆలయానికివచ్చే దైనందిన తీర్థప్రజ, కొత్తనగరంలో విశ్వవిద్యాలయమూ— కళ్ళకు కట్టినట్లుగా ఆ వగ లల్లా తల్లికి చెప్పాడు. రాత్రి అన్నం తింటూనే ఒక చేత పుస్తకం పట్టాడు.

చదువుతున్న దాపి, జనూ తల్లివంక చూసి, "అమ్మా, దిగులుపడు తున్నావా?" అని హఠాత్తుగా, ఏదో జ్ఞానోదయమైనట్లుగా ప్రశ్నించాడు.

"లేదు నాన్నా. దిగులెందుకు నాన్నా?"

"నాకు తెలుసులే అమ్మా! సావిత్రి నాకంతా రాసింది. నువ్వు దిగులు పడ్తున్నావు. రుక్కు ఇక్కడ వచ్చి ఉంటే నీ కంత ఇదిగా ఉండదు. నేను బావకు నచ్చజెప్పి వస్తానుండు."

"వద్దు నాన్నా, ఎవరి పనులు వాళ్ళకు ముఖ్యం. బావకు కోపం వస్తుంది వద్దులే"

జనూ ఇక మాట్లాడలేదు. ఆ ఒక్కసారి తప్పితే ఆతను సావిత్రి విషయం గూడా ఎప్పుడూ హెచ్చరించలేదు. ఆపిల్ల తన కోడలవుతుందనే ఆశతో అమ్మ ఎదురు చూస్తున్నదని అతనికి తెలుసు. అమ్మ దిగులుపడకుండా సావిత్రి వచ్చి అప్పుడప్పుడు ధైర్యం చెప్పి పోతూంటుందనికూడా తెలుసు.

వస్తూ వస్తూ జనూ చాలా పుస్తకాలు తెచ్చాడు. సావిత్రి వచ్చి వాట న్నిటిని సర్దింది. అట్టలువిప్పి చూసింది. అమ్మకు చూపించింది, షికారు నుండి తిరిగి వచ్చి జనూ వాళ్ళను చూసి అన్నాడు.

"లోకంలో నేర్చుకోవలసిన విషయాలు చాలా ఉన్నయి అమ్మా. బావిలో కప్పలాగా ఇక్కడ నేను చదివిందంతా, లోకానుభవంముందు చిన్న అణువుగా కన్పిస్తున్నదమ్మా. మనం ఈ దేశంలో ఏ మూల ఉన్నా ఈ దేశ మంతా ఒకటే అని కాశీ చూసిన వాళ్ళకు తెలుస్తుందమ్మా"

సావిత్రి సిగ్గుపడ్డది. కాని తల్లి రెప్పవాల్చక కొడుకువంక చూసింది. ఈ ఒక్క సంవత్సరంలోనే యెంతో పొడుగు పెరిగినట్లున్నాడు. ఎంతో మెరు గైన ఛాయ వచ్చింది. ఇంటి తిండిలేక దిగులుతో చిక్కి వస్తున్నాడనుకొన్న

కొడుకు - నాజూకై కళ్ళల్లో కొత్త కాంతితో - కొత్త మాటలు, ఆ మాటలు లోతుగా చెప్పగల సామర్థ్యంతో తిరిగి వచ్చాడు. తన చీకటిలోకి విమలలోక కాంతి తెస్తాడని ఎదురు చూచింది, నిజమే. కాంతినే తెచ్చాడు. కాని ఈ కాంతి తను ఆశించినదీ. ఊహించినదీ కాదు. అంతకు మించినది. తనకర్థం కానిది.

ఆ రాత్రి అన్నాల ముందు కొడుకును హెచ్చరించింది.

''అనూ వాళ్ళు మాత్రం ఇంకెన్నాళ్ళని వేచి ఉంటారు. నువ్వు పెళ్ళి చేసుకోవటం మంచిది నాన్నా. వాళ్ళకు కూడా భయం ఉండదు. సంతోషిస్తారు''

"వాళ్ళెవరమ్మా?"

''అదేమిటి నాన్నా!! సావిత్రి వాళ్ళు ..."

''నేను పెళ్ళి సంగతి ఆలోచించటం లేదమ్మా, మనదేశం సంగతి తలచుకొంటే ఏడుపు వస్తుందమ్మా."

రాత్రి కొంచెం ఆలస్యంగా యింటికి వచ్చాడు. మరొక వారం రోజుల్లోనే జనూ తిరిగి వారణాసి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన మర్నాడే సావిత్రి తల్లివచ్చి -

"వదినే, యిది మీకు న్యాయమేనా" అని దిగులుగా, బరువుగా, నిష్ఠూరంగా అడిగింది.

"ఏమైంది సుభద్రమ్మా?" తని తల్లి విభ్రమురాలై ఆమె వంక చూసింది.

"ఇంకేం కావాలమ్మా. జనూమీద ఆశ పెట్టుకొని యిన్నేళ్ళూ సావిత్రి పెళ్ళిమాట తలపెట్టలేదు. మాట ఒకటీ, చేత ఒకటీనా వదినే. కుండ బద్దలు గొట్టినట్లు చెప్పాడు. నీ కొడుకు! ఇది అది నిష్ఠూర్యమైతే ఎవరికీ కష్టం వుండేదిగాదు. ఆడ పిల్లను గన్న తల్లివి. ఈఅంత్య నిష్ఠూర్యం నువ్వు భరించగలవా వదినే? ఆ పిచ్చిపిల్ల బయటికి ముఖం చూపించటం లేదమ్మా. నా గుండె తరుక్కుపోతున్నది వదినా? ఇది ధర్మమేనా? మీకు జయమౌతుందా? అన్నీ తెలిసిన దానివి మళ్ళీ" అని సుభద్రమ్మ ఉద్రేకంలో మాట్లాడింది.

అమ్మ తిరుగు జవాబు చెప్పలేదు. అందుకా - పెళ్ళి సంగతి హెచ్చరించిన రాత్రి, జనూ ఎక్కడికో వెళ్ళి వచ్చింది. ఇక్కడికేనా? ఈ చిరకాల ప్రేమలతా బంధనాలు త్రెంపటానికేనా? రాత్రికి రాత్రే కొడుక్కు ఉత్తరం వ్రాసింది. పెద్ద ఉత్తరం. అది ఉత్తరం గాదు. ఆమె తన గుండె తరిగి మాటలుగా పేర్చింది. ఉత్తరాన్ని చివరికిట్లా ముగించింది:

"జనూ! మీ నాన్నగారు ఏమి తక్కువైందని, అట్లా ఎవరికి చెప్ప కుండా హఠాత్తుగా సన్యాసుల్లో కలసిపోయింది? నిన్నూ రుక్కునూ చూచైనా ఆయన హృదయం కరిగి ఉండాల్సిందే? నేను పుణ్యస్త్రీగా బతుకుతున్నానే గాని, ఆ గౌరవం, అనుభవం ఏమి పొందుతున్నాను? నీ కన్నా రుక్కును వెయ్యి రెట్ల గారాబంతో పెంచాను. రుక్కూ తనకు తల్లి లేనట్లే ప్రవర్తించింది. నాన్నా! నాకు మిగిలింది నువ్వే. ఇంత హాలాహలం మింగినా, అమృత భాండంగా నువ్వున్నావని ఇన్నాళ్ళూ కలచే గుండెను కదియపట్టుకున్నాను. బతికినన్నాళ్లూ బతకపోతానా జనూ? నువ్వు తప్పితే నా కింకేముంది? నా కళ్ళ ముందుంటే నా తపం ఫలించినట్లవుతుంది నాన్నా సావిత్రంటే నీకు ప్రేమ లేదా? రుక్కుకన్నా నీకూ, నాకూ ప్రియతమమైనదే. జనూ, నాన్నా నిన్నేమీ అడగను ఇంతకన్నా."

అమ్మ పది రోజులు జవాబు వస్తుందని ఎదురు చూసింది. పది రోజుల తర్వాత తను వ్రాసిన ఉత్తరమే తిరిగి వచ్చింది.

ఆ ఉత్తరం తిరిగి వచ్చిన మర్నాడే జనూకోసం పోలీసులు గూడా వచ్చారు. "నా జనూ చదువుకోవటం లేదా? జనూ కాశీలో లేడా?" అని అమ్మ వచ్చిన వాళ్ళను అడుగుతున్నది.

* * *

సంవత్సరం వరకూ జనూ సంగతి ఎవరికీ ఏమీ తెలియలేదు. 1942 దేశమంతా పర ప్రభుత్వ దాస్య శృంఖలాలు త్రెంచే విప్లవయాగం చేస్తున్న రోజుల్లో జనూ ఏమో చేశాట్ట. ఎక్కడికో పోయాట్ట.

అమ్మ ఇప్పుడెవరితోనూ మాట్లాడడం గూడా లేదు. రుక్కు వచ్చి తనతో రమ్మని అడిగింది. అమ్మ రుక్కుతో గూడా మాట్లాడలేదు. మౌన స్వామినివలె కూర్చున్నది దుప్పటి కప్పుకొని. రుక్కు వెళ్ళిపోయింది.

ఆ రోజునుంచి అమ్మ సన్యాసిగా దేశాలమీద పోయిన తన భర్తనూ, రుక్కునూ, జనూను - అందర్నీ మరచి పోయింది. ఆమె మనస్సంతా సీతారామమయం చేసుకొన్నది. ఆ పవిత్రనామం తప్పితే, ఇంకేమీ ఉచ్చరించ లేదామె. పెళ్లయి అత్త వారింటికెళ్లుతూ నమస్కరించటానికి వచ్చిన సావిత్రిని ఆమె మౌనంగానే దీవించింది.

అట్లా అమ్మ జీవితం తరించిపోయేదేమోగాని ఒక చలికాలం తెల్లవారు ఝామున - తలుపును ఒకటికి రెండుసార్లు తట్టారు. లేచి వెళ్ళి తలుపు తీసింది.

గుడ్డి దీపపు కాంతిలో జనూ తలుపు తోసుకుని లోపలికి ప్రవేశించాడు.

అతనివెంట పిరికి పిరికిగా ఒక అమ్మాయి గూడా లోనికి వచ్చింది. తల్లి జనూని గుర్తించలేదు. అతను 'అమ్మా' అన్నదాకా.

"జ...నూ..."

"అమ్మా...ఇదిగో నీ కోడలు" అని తల్లి పాదాలు స్పృశించి, ఆ పాద ధూళిని శిరస్సున వేసుకొని, "సరళా! ... అమ్మా" అని ఆ పిల్లవంక చూశాడు.

ఆ అమ్మాయి వంగి తల్లి పాదాలను తాకింది. కాని, నిలబడలేదు.

"అమ్మా! సరళ వంట్లో బాగులేదు" అని జనూ అన్నాడు.

తల్లి కలవరపడింది. ఆమె కంఠంలో కాలం, విషాదానుభవాల హాలాహలంగా అడ్డుపడి మాట పెగలనియలేదు. మైకం కమ్మినట్లయి తూలి, కోడల్ని కౌగిలించుకొన్నది. ఒక్క క్షణంలో తన కోడలు గర్భవతి అని గ్రహించింది. ఆమె కళ్ళెత్తి చూసేసరికి జనూ అక్కడ లేడు. ఆ మసక చీకటిలో కలలాగా మాయమైపోయాడు.

"కోడలుపిల్లా...జనూ ఎక్కడ?"

"మీ కొడుక్కు మిలిటరీ కోర్టులో ఉరిశిక్ష పడింది. జైల్లోంచి తప్పించుకొన్నారు. ఈసారి పట్టుబడితే అంతే అత్తా"

* * *

కాని పది రోజుల్లోనే జనార్దనం పట్టుబడ్డాడు. వార్తాపత్రికలన్నీ అతని ఫోటోలతో, జీవిత చరిత్రతో దినదినం నిండిపోతున్నాయి. అమ్మను, సరళను మాట్లాడించేందుకు మంచివాళ్ళు, ఫోటోలకోసం ప్రెస్సువాళ్లూ కోలాహలం చేస్తున్నారు ఇంట్లో. ఆ పత్రికల కథల్ని బట్టే అమ్మ జనూ సరళను ఎక్కడ ఎట్లా పెళ్ళి చేసుకొన్నది చదివింది.

అంపశయ్య మీది భీష్ముడికి ఒక్క బాణంతో పాతాళగంగను కొనితెచ్చి ఉత్తరాయణ పుణ్యకాలందాకా ప్రాణాలు నిల్పిన అర్జునుడివలె, నిరామయంగా నిరాపేక్షతో జీవితం గడుపుతున్న తల్లికి, తను ఒక్కసారి విద్యుల్లతవలె కన్పించి ఆతపశ్చర్యకు భంగం కలిగించాడు. ఆమె ప్రతి రక్త బిందువూ కొడుకుకోసం ఆక్రోశించసాగింది. ఇప్పుడామె రాముణ్ణి మరచి పోయింది. జనూ, జనూ నువ్వు లేకుంటే నాకీ బ్రతుకెందుకు అని అనుక్షణమూ వాపోతున్నది. ఈ కొత్త లోకంలో ఆమెకు ఒక వెలుగుగా కన్పిస్తున్నాడు.

ఆవెలుగులో కొత్తకోడలు ఛాయామాత్రంగా వుంది.

పరప్రభుత్వం మాత్రం విద్రోహ చర్యలకు పాల్పడిన దేశీయుల మీద నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్నది. ప్రత్యేక న్యాయస్థానాల్లో విచారణలు రోజుల్లో తేల్చివేయ బడుతున్నాయ్.

ఇక జనూను ఉరి తీస్తారనగా ఆదినం తల్లిని తీసుకుపోయారు. జనూతో యింకా కొంతమంది కుర్రవాళ్ళు. వాళ్ళను చూచేందుకు తండ్రులు, అన్నలు, తమ్ములు, బిడ్డలూ వచ్చారు.

జైలు కమ్ముల్లోంచి చేతులుచాచి తల్లి పాదాలను కళ్ళకద్దుకొన్నాడు జనార్దనం.

"అమ్మా నన్ను క్షమించగలవా?" ఆమె అతనికళ్ళల్లోకి చూసింది. ఈప్రాణి రేపువుండదా? ఆతర్వాత తను వుండి ఏమిసాధించను? తనకేమీలేన ప్పుడు తన బ్రతుకుకేమర్థముంది?

"నీకు సేవ చేయలేకపోయానమ్మా నిన్నూనన్నూ గన్నతల్లి భరతమాత ఋణం తీర్చుకొందామని ఆశించాను. నాతరంలో తీరదు ఈ ఋణం వచ్చేతరం వాళ్ళు అదృష్టవంతులు వాళ్లే నీబిడ్డలమ్మా".

అమ్మకివేమీ వినిపించటం లేదు. ఆమె దొక్కటే ప్రశ్న "జనూనన్ను అన్యాయం చేసిపోతావా?"

అపుల ఏడ్పుల నుండి విప్లవకారులు నినాదాలు చేయసాగారు. ఆ చుట్టు పక్కలంతా పెద్ద ప్రతిధ్వనులు. ఆ తర్వాత పాటలు పాడటం మొదలు పెట్టారు.దుఃఖభాజనులైన అక్కడి బంధు సమూహం గూడా, ఆ వీరరసాత్మక మైన పాటలకు ఉత్తేజితులైనారు. కాని తల్లికివేమీ వినిపించటంలేదు, కనిపించ టంలేదు.

ఇంతలో గంటకొట్టారు వార్డరులొచ్చారు "టైం అయిపోయింది. టైం అయిపోయింది" అంటున్నారు.

అమ్మను- రుక్కు మొగుడువచ్చి కింద పడకుండా పట్టుకొన్నాడు. అప్పటిదాకా- జనూ సరళ మాట ఎత్తనేలేదు. ఒకచేత్తో కమ్మీపట్టుకొని- "అమ్మా- సరళకంతా చెప్పాను. నేను చేయలేని సేవ నాబదులు నీకు చేస్తుం దమ్మా -దిగులు పడకమ్మా—జై..." అంటున్నాడు. అంతా చీకటైపోయింది. అమ్మ ఈ చివరిమాటలు అసలు వినలేదు.

రుక్కు మొగుడు తెచ్చిన కార్లో కూచున్నది. ఎప్పుడెప్పుడు యిల్లు చేరుదామా- ఎప్పుడెప్పుడు దొడ్డిలో పెద్ద బావిలోదూకి- ఈదుర్భరశోకానికి

భరతవాక్యం పాడదామా అని ఆమె అనుకొంటున్నది. ఆమె మౌనం కంటె రహస్యమైనదీ— కఠోరమైనదీ ఆ సంకల్పం.

కారు యింటిముందుకొచ్చి కుదుపుతో ఆగింది. కాని అమ్మకేదో బహుపరిచయ, బహుప్రాచీన,బహుఆత్మీయమైన శబ్దం, స్వరం వినిపించింది— తన యింట్లో నించే. అమ్మ కారు దిగుతున్నది. అక్కడ చాలామంది అమ్మలక్కలున్నారు.

"అమ్మా— నీకు మనుమడు పుట్టాడు. మనమడు." అంటున్నారు వాళ్ళంతా.

అమ్మ నేరుగా యింట్లోకి పోయింది. ప్రసవ వేదనకుబదులు పసిబాలుడి రోదనం వినిపించింది.

తన మంచమే, జనూనికని తను అన్నేళ్ళకిందట— ఆముదపు దీపపు కాంతిలో ఆమంచంలో పడుకొని వుండగా తన అత్తగారు ఎట్లా, వూరినుంచి హడావిడిగా వచ్చిందో, తనూ అట్లాగే వచ్చింది. కళ్ళకు కట్టినట్లయి మంచం వద్దకుపోయి——

"సరళా" అని పిలిపించి.

సరళ కన్నెత్తిచూచింది. ఆ చూపులో గర్వమో, జాలో, చిరునవ్వో దాగివున్నది. చూచి, తన కొడుకును అమ్మ మనుమణ్ణి గుర్తించమన్నది.

అమ్మకు— మానవుల్ని ఏఆశాజ్యోతి, ఏమమత చుట్టుకొని, అన్ని నిరాశల్ని, భయంకర సంకల్పాలను దూరంగా తరుముతుందో- ఆ ఆవేశమే వచ్చింది.

ప్రక్కనున్న మంత్రసానిని చూచి పెద్దగా అడిగింది.

"గంగమ్మా—పసిపిల్లవాడి స్నానానికి యింకా నీళ్ళు తోడించలేదుటేః"

అంతే. ఆ క్షణంనుండి పసివాడి మహత్తర రక్షణబాధ్యతకు పూనుకొన్నది—అమ్మ;

ఎక్కడలేనిబలం వచ్చింది మాటల్లో నిస్పృహ మాయమైనది.

ఆముదపు దీపం కొండెక్కుతుంటే లోనికి పరుగెత్తిపోయి, యింతనూనె తెచ్చి పోసింది.

దీపం భళ్ళున తేజంగా వెలిగింది.

ఆ వెలుగులో అమ్మకు జీవిత రహస్యం, వేదాంతసారం సాక్షాత్కరించినాయి. ప్రమిదె వత్తిలో తన మనుమడు కనబడుతున్నాడు. క్షణక్షణానికి ఆమె తన పాతశక్తిని పుంజుకొంటున్నది.

కమ్మని వాసనతో సన్నగా జ్వాల అటూ యిటూ కొట్టుకులాడి నప్పుడు- ఆమె అనుకొంటున్నది- తనకు తాను తెలియ కుండానే—"నా కొడుకు చావ లేదు, నాకొడుకు చావలేదు."

గంగమ్మను మరోసారి గట్టిగా కేకవేసింది. గంగమ్మ జవాబిచ్చే లోపల్నే. తనుపోయి జనూ తనకు వారణాశి నుండి తెచ్చిన ఉత్తరాది రగ్గును కోడలికి కప్పుతూ—"బిడ్డా" అని మెల్లగా, ఆమె నిద్రకు భంగంకలుగ కుండా పిలిచింది.

(క్రిష్ణా పత్రిక-స్వాతంత్ర్యదినోత్సవ సంచిక : 12 ఆగష్టు 1961)